# యదార్ధమేది?

The Cooperative Office For Call & Guidance to Communities at Naseem Area
Riyadh -Al-Manar Area - Front of O.P.D of Al-Yamamah Hospital
Tel.: 2328226 - 2350194 - Fax: 2301465
P.O.Box: 51584 Riyadh 11553

Telugu
113

*Haqeeqat Kya Hai?*
*(Telugu)*

# యదార్థమేది?

**Yadardhamedi ?**

**Haqeeqat Kya Hai ? (Telugu)**


ⓒ مكتب الدعوة والإرشاد وتوعية الجاليات ببريدة ، ١٤٢٠هـ

*فهرسة مكتبة الملك فهد الوطنية أثناء النشر*

يوسفي ، جلال الدين

ما هو الحق - بريدة.

٢٠ ص ؛ ١٢ × ١٧ سم

ردمك : ١ - ٥٦ - ٧٨٣ - ٩٩٦٠

(النص باللغة التلغو)

١- الإسلام ٢- العقيدة الإسلامية

أ- العنوان

ديوي ٢٤٠ ٢٠/٠٢٤٦

رقم الايداع ٢٠/٠٢٤٦

ردمك : ١ - ٥٦ - ٧٨٣ - ٩٩٦٠

*కరుణించేవాడు, కనికరించేవాడయిన అల్లాహ్ పేరుతో*

# యదార్థమేది?

సోదరులారా!

దైవం, మతం, పరలోకం- వీటిని గురించి సాధారణంగా రకరకాల నమ్మకాలు ప్రజల్లో ఉన్నట్లు మనం వింటున్నాం. కొందరు దేవుడు ఉన్నాడనీ, కొందరు లేడని అంటారు. కొందరు మానవ జీవితానికి మతమే ముఖ్య అవసరమని, మరి కొందరు మతంలో విశ్వాసం అనేది ఒక మూఢ నమ్మకం మరియు ఉన్మాదమని అంటారు. కొందరు ఈ ప్రపంచంలోని భోగభాగ్యాలే జీవితానికి అసలయిన ఉద్దేశ్యాలని, ఈ ప్రాపంచిక జీవితానంతరం ఇంకో జీవితం అంటూ లేనేలేదని అంటారు. ఇంకా కొందరు పరలోక మోక్షానికి కొన్ని నమ్మకాలు చాలని, ఆ తర్వాత పాపపుణ్యాలు అనేవాటికి ఎలాంటి పాటింపు అవసరం లేదని భావిస్తున్నారు. మానవ జీవిత గమనం అతని నమ్మకాల పైనే ఆధారపడి ఉంటుంది. కాబట్టి ఇలాంటి పరస్పర వ్యతిరేక స్వభావాలు, నమ్మకాలు గల వారి జీవిత లక్ష్యాలలో, లక్షణాలలో కూడా వ్యతిరేకత ఉండటం అనివార్యం.

# ఎన్ని నమ్మకాలు?

దేవుడు ఉన్నాడని నమ్మేవారిలో కూడాను, కొందరు దేవుడు మానవ రూపంలో అవతరిస్తాడని, మరికొందరు దేవునికి సంతానం ఉందని, ఆయనకు సహాయపడేవారు ఉన్నారని తలుస్తున్నారు. దైవానికి సహాయం చేసేవారిని పూజాపురస్కారాల ద్వారా సంతోషపెడితే ఆ దైవాన్నే సంతుష్టునిగా చేసినట్లు అవుతుంది అని అనుకునేవారున్నారు. దేవుడు, ఈ లోకాన మానవుణ్ణి సృష్టించి వదలివేశాడని, మనపై ఆయనకు ఎట్టి అధికారం, అధీనం లేదని, మనం ఇక్కడ మన ఇష్టానుసారం జీవించవచ్చు అని భావించే వారూ ఉన్నారు.

మతాన్ని విశ్వసించేవారిలో కొందరు, మతం ఒక వ్యక్తిగత సమస్య అని, సాంఘిక రాజకీయ విషయాలతో ఈ మతానికి ఎట్టి సంబంధం లేదని, వ్యక్తిగత జీవితంలో పూజాపురస్కారాల ద్వారా దేవుణ్ణి మెప్పిస్తూ సాంఘిక, రాజకీయ విషయాల్లో మాత్రం మనం మన ఇష్టానుసారం ప్రవర్తించవచ్చని కొందరు భావించగా, ఇంకా కొందరు సర్వ మతాలూ సత్యమయినవే అని ఏ మతాన్ని అవలంబించినా చేరే గమ్యస్థానం ఒక్కటే అని భ్రమపడుతున్నారు.

ఇహలోకం గురించిన భావనల్ని చూడండి. కొందరు ఈ లోకంలోని భవబంధాలు, జీవితంలోని సుఖాలు అన్నీ ఆత్మకు సంకెళ్ళని, లౌకిక వ్యవహారాలనే రొంపిలో ఇరుక్కోనడం వల్ల ఆత్మ వికాసం పొందదని అభిప్రాయపడతారు. అదే విధంగా ఇంకా కొందరు తమ సుఖసంతోషాలే తమ జీవితాల పరమార్థాలని, వాటిని పొందేందుకు తమ అనుభవాలే మార్గ దర్శకాలని తలచి, అనుభవాలు మారేకొలది నియమనిబంధనలను కూడా మార్చుకుంటూ, ఒక మార్గమంటూలేని జీవితాన్ని గడపేలంటారు.

పరలోక నమ్మకం ఉన్నవారిలో కొందరు దైవ కుమారునికి సిలువ వెయ్యడం వల్ల తమ తమ పాపాలు క్షమించబడ్డాయని నమ్మితే, మరికొందరు ఇలాంటి ఆధారాలను నమ్మి మోక్షం సాధించాలనుకుంటున్నారు. ఇంకా కొంత మంది, మానవుడు దేవునిలో లీనమయిపోవడమే, అంటే ఆత్మ పరమాత్మలో విలీనమవడమే మోక్షం అని, ఇంకా ఒక జన్మలో చేసిన కర్మల ఫలితాలను అనుభవించటానికి ఈ లోకంలోనే మరో జన్మ ఎత్తుతూ ఉండాలని కూడా నమ్ముతున్నారు.

ఆధ్యాత్మిక నమ్మకాలు గలవాళ్ళు ఇలా విభిన్న నమ్మకాలు కలిగి ఉండగా, ఈ నమ్మకాలను నిర్లక్ష్యం చేసి, వీటిని గురించి అసలు ఆలోచించే అవసరమే లేకుండా తమ తమ సుఖ సంతోషాలే తమ జీవిత పరమార్థాలుగా భావించి తమ జీవితాలను వెళ్ళబుచ్చేవారూ ఉన్నారు.

## మతం అవసరమా?

ఈ స్థితిలో మనం మొట్టమొదట ఆలోచించవలసిన విషయం ఏమంటే- పైన ఉదాహరించబడిన విషయాలను మనం చర్చించి, తర్కించి, తేల్చి, తెలుసుకొని అవి నమ్మకాల రీత్యా అవసరమయిన విషయాలా? కావా? అన్న విషయం.

మానవుడిని అలా వుంచి ఇతర జీవరాసులన్నిటి జీవితాలను గమనించండి. ఉదాహరణకు ఒక గేదెనే తీసుకోండి. అది తన ఆకలి తీర్చుకోడానికి నోటికి అందిన గడ్డిని మేస్తుందే కాని ధర్మ అధర్మాల నిబంధనలను పరిశీలిస్తూ నిల్చోదు. కాని మానవుడు, సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను, సన్మార్గదుర్మార్గాలను, దయ నిర్దయతలను గ్రహించేవాడు కావటం మూలానా దైవం, మతం, ఇహం, పరం అనే విషయాలను గూర్చి ఆలోచించి, మంచి

చెడులను గ్రహించి, నైతిక నిబంధనలను అవలంబించడానికి బాధ్యుడయి ఉన్నాడు. ఇలాకాకుంటే, మానవ జీవితానికి, ఒక పశువు జీవితానికి తేడా ఏముంటుంది? మానవునిలో ఇమిడి ఉన్న అనేక శక్తుల ప్రయోజనం ఏమీ ఉండదే! మనకున్న కళ్ళు చూచేందుకు, చెవులు వినేందుకు, నోరు మాట్లాడేందుకు అని మనకు తెలుసు. పై విషయాలను గ్రహించి తత్సంబంధమయిన నైతిక నిబంధనలను అవలంబించకుంటే మరి వాటి ప్రయోజనం ఏమిటి?

## దేవుడున్నాడా?

ఇలా తన జ్ఞానాన్ని ఉపయోగించి ఈ లోకాన్ని, దీని తత్వాన్ని, దీని పోకడను, ఇందున్న మహత్తర సృష్టిని చూస్తే దీన్నంతటినీ సృష్టించిన ఒక కర్త ఉన్నాడు, ఆయనే సర్వ శక్తిమంతుడని, ఆయనకే సర్వాధికారాలు ఉన్నట్లు మనం నమ్మక తప్పదు.

మన ఈ కుర్చీ, మన ఈ ఇల్లు, మనం చదివే ఈ పుస్తకం, మనం రాసే కలం మొదలయినవి వాటంతట అవే తయారుకాజాలనపుడు, భూమి, భూమిపై వెలుగును కలిగించే సూర్యుడు, చంద్రుడు, ఆకాశంపై మెరిసే కోట్లాది నక్షత్రాలు, గాలి, సముద్రాలు, వివిధ రకాల జంతుజాలం, పక్షులు మేమూ మీరూ– ఇదంతా దానంతట అదే ఉనికిలోకి వచ్చిందా?

ఆకాశాన చంద్రుడు, కోట్లకొలది నక్షత్రాలు, వాటికి నియమింపబడిన మార్గంలోనే భ్రమిస్తున్నాయి. అవి ఏ మాత్రం తమ మార్గం తప్పి ప్రక్కకు తొలగజాలవు. సూర్యుడు తనకు నిర్ణయించబడిన మార్గాన్నే అనుసరిస్తున్నాడు. సూర్యుని వేడిమి నీటిని ఆవిరిగా మారుస్తోంది. ఆ ఆవిరి మళ్ళీ నీరుగా మారి వర్షంగా కురుస్తోంది. వర్షం మనందరికీ జీవనాధారం. దాని మూలంగా

భూమిపై మొలకెత్తే మొక్కల వల్ల, వృక్ష సంపద వల్ల ఎన్నో జీవరాసులు పోషింపబడుతున్నాయి. అయితే ఈ కార్ఖానా అంతా దానంతట అదే నడుస్తున్నదా?

మానవుని సుందరమయిన శరీరాన్ని గమనించండి. మీ నాలుక, మీ పెదాల కదలికల వల్ల శబ్దం రూపుదిద్దుకుంటుంది. ఇది ఎంత గొప్ప విషయమో మీరు గ్రహించారా? పుట్టు మూగవాణ్ణి మాట్లాడించగల యంత్రం మానవుడు ఇంతవరకు కనిపెట్టలేకపోయాడు. వస్తువుల ప్రకంపనల మూలంగా ఏర్పడే శబ్ద తరంగాలు గాలి ద్వారా మీ చెవులకు ఢీకొన్నప్పుడు ఆ శబ్దాన్ని మీరు వినగల్గుతున్నారు. ఆ శబ్దాలను వినే శక్తి ఎలాంటిదో శాస్త్రజ్ఞులు ఇప్పటి వరకు గ్రహించలేకపోయారు. పుట్టు చెవిటివాడు వినగలిగే యంత్రం మానవుడు ఇంతవరకు తయారు చేయలేకపోయాడు. ఇదే విధంగా పుట్టు గ్రుడ్డివానికి దృష్టినిచ్చే శక్తి మానవునికి లేదు- ఇలాంటి ఆశ్చర్యకరమయిన పనులు చేయలేని మానవుడు తనంతట తానే పుట్టాడా?

మానవ శిశువు తయారయ్యే ఆ తల్లి గర్భమనే ఫ్యాక్టరీలో తల్లికి ఎలాంటి స్వాతంత్ర్యం అయినా ఉందా? ఆ శిశువును తల్లే తయారు చేస్తుందని చెప్పగలమా? ఒక చిన్న తిత్తిలో రెండు సూక్ష్మాతి సూక్ష్మమయిన జీవకణాలు కలిసి పిండంగా రూపొందితే తల్లి రక్తం ద్వారా ఆ పిండానికి ఆహారం లభిస్తున్నది. దానికి ఆ పదార్థాలు ఎలా అందజేయాలో తల్లికి ఏ మాత్రం తెలియదు గదా? ఆ పదార్థాలు తాను భుజించే ఆహార పానీయాల్లో నుండి సేకరించి రక్త రూపాన్నిచ్చి, శిశువు శరీరాన్ని తల్లే తయారుచేస్తుందని ఎవరయినా చెప్పగలరా? కళ్ళు, చెవులు, హృదయం, ఊపిరితిత్తులు, ఆలోచించే శక్తి గల మెదడు, చివరికి ప్రాణం ఏర్పడి నవ మాసాల పిదప ఆ గర్భపు ఫ్యాక్టరీయే ఆ శిశువును బయటకు త్రోసివేస్తుంది! బయటకు రాగానే ప్రతి

అవయవం తన పనిని ప్రారంభిస్తుంది. ఇలా ఆలోచించే కొద్దీ మన ఆశ్చర్యానికి అంతే ఉండదు. ఇవన్నీ గొప్ప శక్తిమంతుడయిన ఇంజనీరు తయారు చేసి ఉండాలి అని మన మనస్సే సాక్ష్యమిస్తుంది. ఆయనే "అల్లాహ్," "దైవం," "సర్వ సృష్టికర్త."

## దేవుడు ఒక్కడే

ఈ విశాల విశ్వంలో అన్ని పనులు ఎలా సక్రమంగా నెరవేరుతున్నాయో చూడండి. వర్షం మూలంగా తడిసిన విత్తనాన్ని మొక్కగా బయటకు తీసి మన ఆహార సామగ్రిని అందించే ఈ మట్టి సూర్యుని వేడిమి, ప్రాణికోటికి జీవనాధారమయిన గాలి, ఇవిగాక భూమి లోపల ఉండి మొక్కలు పెరగడానికి సహాయం చేస్తున్న సూక్ష్మజీవులు, ఇంకా ఇలాంటి అనేక శక్తుల ద్వారా ఒక నియమానుసారం ఏకీభావాన్ని సృష్టించి, పని చేయించి మనకు ఆహారం, ఇంకా అనేక వసతులు కల్పించే శక్తిని చూస్తూ ఉంటే ఈ యావత్తు లోకం నిర్వహణకు మూలం ఒకే ఒక కర్త అనీ, ఆయన ఆదేశానుసారమే ఈ కార్ఖానా అంతా పనిచేస్తుందని నమ్మడం అనివార్యం కాదా?

సామాన్య కార్యాలయంలో, ఒక చిన్న రాజ్యంలో ఒకరి కంటే ఎక్కువ మందికి బాధ్యతలప్పగిస్తే అక్కడి పనులు నెరవేరక పరిపాలన తలక్రిందులవుతుంది. కాబట్టి ఈ ప్రపంచానికీ, విశ్వానికీ పెక్కు దేవుళ్ళు ఉన్నారనికాని, లేక పెక్కు ఆడ, మగ, దేవతల సహాయ సహకారాల ద్వారా దేవుడు ఈ ప్రపంచం కార్యాలను నిర్వహిస్తున్నాడని అనుకోవడం సమంజసం కాదు. ఇతరుల సహాయం అవసరంలేని శక్తిసామర్థ్యాలు కలవాడే దేవుడు. ఈ ప్రపంచం అంతా దేవుని సృష్టి అని అనటం ఎంత వాస్తవమో దేవుడు ఒక్కడే

అని, ఆయనకు సాటి లేరని, సర్వకాల సర్వావస్థలయందు ఈ కార్యక్రమాలన్నీ ఆయనే నడుపుతున్నాడని, ఆయనకు ఇతరుల సహాయం అవసరం లేదని, ఆయన తన ఇష్టానుసారం ఏ పని అయినా చేయగలడనీ, చేస్తున్నాడనీ, ఆయన ఆజ్ఞలను వ్యతిరేకించే శక్తి ఎవ్వరికీ లేదని అనడం కూడా అంతే వాస్తవం. అదే విధంగా దేవుడు ఎప్పుడయినా, ఏ రూపంలో అయినా భూమ్మీద అవతరించటం గాని, దేవునికి కుమారులు ఉండడంగాని లేక దేవుడు ఒకరి కుమారుడై ఉండడంగాని దేవుని ఘనతకు, పరిశుద్ధతకు విరుద్ధం, ఇలా భావించడం సమంజసం కాదు అని సులభంగా గ్రహించగలం.

## మతము

"మతం ఒక వ్యక్తిగత విషయం" అనే మాటను మీరు వినే ఉంటారు. దేవుడు ఒక్కడే. ఆయన్ని నిరాటంకంగా, ఆనందంగా మానవుడు తన వ్యక్తిగత జీవితంలో పూజించి సేవించవచ్చు. కాని లౌకిక వ్యవహారాల్లో దైవం, మతం అనేవి ఉండరాదని, సాంఘిక, రాజకీయ జీవితంలో మనిషి దైవం, మతం అనే విషయాలకు లోబడి ఉండకుండా, స్వతంత్రంగా ఉండాలని, సామాజిక విద్య, ఆర్థిక విషయాలు, న్యాయవ్యవస్థ, పార్లమెంటు, రాజకీయాలు, స్వదేశీ విదేశీ వ్యవహారాలు- ఇంకా జీవితానికి సంబంధించిన పెక్కు వ్యవహారాలన్నీ దైవం, మతం యొక్క ప్రమేయం లేకుండా స్వేచ్ఛగా మానవుల ఇష్టం ప్రకారం జరగాలని, ఈ "లౌకిక" విషయాల్లో దైవాజ్ఞల్ని వెదకడం కేవలం సంకుచితమయిన తలంపుగా·మూఢత్వంగా భావించబడుతోంది.

దేవుడు ఉన్నాడని, ఆయన్నే పూజించి సేవించాలి అనే వారు బహు అరుదు అవడం మూలాన, మత ప్రసక్తి లేని విద్య, లక్ష్య సమాజ భావాలు

అధికమవడం మూలాన, ధర్మపరిధిలో నడిచే వ్యక్తిగత జీవితం కూడా లౌకికమయిపోయింది. అలాంటి వారి మతావలంబన వ్యక్తిగత జీవితంలో కూడా మిగల్లేదు. దేవునితో వారి వ్యక్తిగత సంబంధం కూడా తెగిపోయింది.

ఆలోచించండి. "దేవుడు, మతం అన్నవి వ్యక్తిగత విషయాలు అనడం కేవలం అర్థరహితం. దేవుడే వాస్తవంగా మన యొక్క, ఈ విశ్వం యొక్క సృష్టికర్త, యజమాని అయినప్పుడు- ఆయన అధికారం వ్యక్తిగత జీవితం మట్టుకే పరిమితం చేయడం, కొందరు వ్యక్తుల కలయిక వల్ల ఏర్పడ్డ సంఘంలో ఆయనకు అధికారం లేదనడం అర్థరహితం కాదా? వ్యక్తిగత జీవితంలో స్వామిగా అంగీకరించి సామాజిక జీవితంలో దైవాన్ని కాదని ఇచ్ఛానుసారం వ్యవహరించటం సృష్టికర్త, ప్రభువు, అధికారి పట్ల ద్రోహం కాదా?? ఇట్టి ద్రోహానికి ఒడిగట్టి తాను వ్యక్తిగతంగా మట్టుకు దైవాన్ని విశ్వసిస్తున్నానని అనేవాడు కేవలం అవివేకి మాత్రమేకాగలడు. వ్యక్తిగతంగా ప్రతి వ్యక్తి దేవుని దాసుడని, అట్టి వ్యక్తుల సమాజం ఏర్పడగానే వ్యక్తులంతా దైవ దాస్యంనుండి వేరవుతారనుకోవడం కంటే వేరే వ్యర్థ ప్రలాపం ఏముంటుంది?

మన కుటుంబం, సమాజం, వీధి, పట్టణం, పాఠశాల, కాలేజి, అంగడి, బజారు, పార్లమెంటు, గవర్నమెంట్ హౌస్, సెక్రటేరియట్, సైనిక శిబిరం, పోలీస్ లైన్, యుద్ధ భూమి, సంధి, సమావేశాల్లో దైవ హితవులు అవసరం లేకుంటే, వాటి అవసరం ఇంక ఎక్కడుంటుంది? జీవిత వ్యవహారాల్లో మార్గం చూపని, అట్టి ప్రయోజనం లేనటువంటి దేవుణ్ణి విశ్వసించి, పూజాపురస్కారాలు ఎందుకు జరపాలో అర్థమవడంలేదు. అయితే దేవుడు మనకు మన నిత్య జీవిత వ్యవహారాల్లో మార్గం చూపని అవివేకి (దైవం మన్నించుగాక)

అన్నమాట! లేక ఆయన బోధనలు నిత్య జీవితంలో అనుసరించనట్టివి అన్నమాట! ఇది సంభవమేనా?

అసలు మానవ "వ్యక్తిగత జీవితం" అన్న పదమే అర్థరహితమయినది. అతని జీవితం అంతా సామాజికమే. అతనికి సంఘం, గ్రామం, జాతులతోను, వైజ్ఞానిక, ఆర్థిక, రాజకీయ విధానాలతోను సంబంధాలున్నాయి. ఈ విభిన్న సంబంధాలను చక్కబరచుకోవడంలోనే ఒక్కొక్క వ్యక్తి మరియు అందరు వ్యక్తులు కలసిన సమాజం యొక్క శ్రేయం ఇమిడి ఉంది. ఈ సంబంధాల యొక్క సరయిన, న్యాయమయిన, దృఢమయిన హద్దులు దేవుడు మాత్రమే నిర్ణయించగలడు. దైవోపదేశాలు పాటించకపోవడంచేత సామాజిక విధానం మత ప్రసక్తి లేనిదిగాను, లౌకికమయిందిగాను రూపొంది, అది వ్యక్తి, వర్గం, జాతి, వంశాల స్వార్థపరత్వానికి కారణభూతమయింది.

## అన్నిటిదీ ఒకే దారి!

ఇది ఇలా ఉండగా సర్వ మతాలూ సత్యమయినవే అని, వాటిలో దేన్ని అవలంబించినా దైవాన్ని చేరవచ్చు అనీ, అవన్నీ దేవుణ్ణి చేరేందుకు వేరు వేరు మార్గాలే తప్ప మరేమీ కాదు అని కొందరు అంటారు. ఆ మాటల్ని పరిశీలిద్దాం.

ఒక మతం వాళ్ళు దేవుడు తన కుమారుణ్ణి భూమి పైకి పంపాడని విశ్వసిస్తున్నారు. దేవుడు మానవ రూపంలో భూమిపై అవతరించాడని ఇంకో మతంవాళ్ళు ఘోషిస్తున్నారు. దేవుడు ఎప్పుడయినా, ఏ రూపం లోనయినా భూమిపై అవతరించటం గాని, దేవునికి కుమారులు ఉండటంగాని, దేవుని ఘనతకు పరిశుద్ధతకు విరుద్ధం అనీ, ఆయన ఒక్కడే అనీ, నిరాకారుడనీ ఎలాంటి రూపమూ ధరించడనీ ఇస్లామ్ ధర్మం వెల్లడిస్తూ ఉంది. ఇలానే

మానవుడు మరణానంతరం తన కర్మానుసారం ఉత్తమ జన్మనో లేక నీచమయిన జన్మనో పొంది పలుమార్లు ప్రపంచాన ఉద్భవిస్తూ ఉంటాడని ఒక మతంవారి నమ్మకం. మరణానంతరం, తుది దినాన మానవులంతా ఇంకోమారు సజీవులయి లేపబడతారని ఇస్లామ్ ధర్మం బోధిస్తుంది. ఈ ప్రపంచ వ్యవహారాలు వందలాది స్త్రీ పురుష దేవగణం నడుపుతున్నారని ఒక మతం చూపగా, దేవుడు ఒక్కడే అని, ఆయనకు సాటి ఎవ్వరూ లేరని, యావత్తు ప్రపంచం ఆయన ఆజ్ఞ ప్రకారమే వ్యవహరిస్తూ ఉందని "ఇస్లామ్" బోధిస్తోంది. ఇలాంటి అనేక విషయాల్లో "ఇస్లామ్" ఇతర నమ్మకాలతో ఏకీభవించదు, అయినప్పుడు సర్వ మతాలు సరయినవే అని, దేన్ని అవలంబించినా దైవం మెప్పు బడయగలమని అనటం ఎలా సరిపోతుంది. ఈ మతాలన్నిటిలో ఏదో ఒక మతం మాత్రమే సత్యమయింది కాగలదు. ఒక వస్తువు ఒకే సమయంలో తెల్లదిగానూ, నల్లదిగానూ, ప్రకాశవంతమయింది గాను, కాంతిహీనమయింది గాను ఉంటుందని ఎవరయినా నమ్మగలరా? ఒక వస్తువు ఒకే సమయంలో రెండు విరుద్ధ గుణాలు కలిగి ఉండడం అసంభవం. అందుకే పై విరుద్ధ నమ్మకాలు గల మతాలన్నీ సత్యమయినవే అనడం సరికాదు. "ఇస్లామ్" సత్యమయింది కాదని దాన్ని త్రోసిపుచ్చడం అన్నది వేరే విషయం. కాని అది కూడా నిజమయినదే, దానితో బాటు దానికి విరుద్ధమయిన నమ్మకాలు బోధించే ఇతర మతాలు కూడా నిజమయినవే అని, అన్నిటినీ జతపర్చి, అన్నీసత్యమయినవే అనడం మాత్రం గొప్ప అవివేకం. ప్రశాంత హృదయంతో యోచించి, ఏ ధర్మాన్ని సత్యమయినదిగా స్వీకరించడం సహేతుకమో దాన్ని చిత్తశుద్ధితో స్వీకరించడమే విజ్ఞత. కాస్త నిలకడతో ఆలోచించగలిగిన వారందరికీ ఈ విషయమే బోధపడుతుంది.

# ఇహలోకం

ఈ సృష్టి యావత్తుకు దేవుడు ఒక్కడే కర్త, ప్రభువు. ఇచ్చటి ప్రతి వస్తువుకు కొన్ని శాసనాలు, నియమాలను ఆయన విధించాడు. ఆ శాసనాలను, నియమ నిబంధనలను ఆ వస్తువులు ఏ మాత్రం జవదాటవు. నీరు ప్రవహించడం, వేడెక్కి ఆవిరిగా మారడం, చల్లనిదై గడ్డకట్టడం; మొక్కలు మొలకెత్తి పెరిగి పెద్దదై వృక్షాలవడం ఇదంతా దైవం నియమించిన నియమాల ప్రకారమే జరుగుతోంది. ఇదే విధంగా సృష్టించబడిన ప్రతి వస్తువూ, ప్రతి చరాచర పదార్థం, తన సృష్టికర్త ఆజ్ఞకు లోబడి విధేయత చూపుతూ ఉంది. "అరబీ" భాషలో ఇలా విధేయతను పాటించేదాన్ని "ముస్లిమ్" అని అంటారు. కాబట్టి ప్రపంచంలోని ప్రతి వస్తువు తన సృష్టి కర్తకు 'విధేయత' చూపేదే. అంటే అది "ముస్లిమ్" అన్నమాట. అదే విధంగా దేవుడు మానవుణ్ణి కూడా సృష్టించాడు. అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, అతని హృదయ స్పందనం, కాళ్ళు చేతులు, కళ్ళూ చెవులు ఆ దైవ నిబంధన ప్రకారమే పని చేస్తున్నాయి. మానవుడు తన ఇష్టానుసారం కళ్ళతో వినడంగాని, చెవులతో వాసన చూడడంగాని చేయలేడు. కాబట్టి తాను కూడా సృష్టిలోని ఇతర వస్తువుల్లా సహజంగా ముస్లిమే. కాని దైవం మానవునికి తెలివిని, ఆలోచించి గ్రహించే శక్తిని ఇచ్చి అనేక విషయాల్లో స్వాతంత్ర్యం ప్రసాదించాడు. మానవుడు ఒక విషయాన్ని నమ్మవచ్చు లేక దాన్ని తిరస్కరించవచ్చు. ఒక పనిని ఇష్టమయితే చేయవచ్చు లేక చేయకపోవచ్చు. అంటే అతడు తన జీవితంలో సన్మార్గం అవలంబించి "ముస్లిమ్"గా ఉండటానికో లేక దాన్ని తిరస్కరించి దుర్మార్గాన్ని అవలంబించటానికో దేవుడు మనిషికి స్వాతంత్ర్యం ప్రసాదించాడన్న మాట.

ఈ స్వతంత్ర జీవితంలో, మానవునికి దైవాన్ని మెప్పించగల శ్రేయస్కర మార్గం ఎవరు చూపాలి? దైవాన్ని మెప్పించగల మార్గం మానవుడు స్వయంగా తన బుద్ధిబలాన్ని వినియోగించి తెలుసుకోగలడా? మానవుని జ్ఞానం అంతవరకు వృద్ధి చెందలేదు. మానవుడు తనకు ఉన్న ఈ అసంపూర్ణ జ్ఞానంతో ఇలాంటి ముఖ్య సమస్యను పరిష్కరించుకోలేనప్పుడు, మానవుణ్ణి సృష్టించిన ఆ సృష్టికర్త అతణ్ణి తన ఇష్టానుసారం నడుచుకోమని వదలివేస్తాడా? ఒక యజమాని తన సేవకుడికి ఏ పని చేయాలో, ఏ పని చేయకూడదో తెలుపనట్లయితే, యజమానికి ఏది ఇష్టమో సేవకునికి ఎలా తెలియాలి? కాబట్టి దేవుడు తనకు ఇష్టమయిన ప్రవర్తనను మానవులకు తెలుపడం అనివార్యం.

## దైవ ప్రవక్తలు

మానవ జీవితానికి కావలసిన చిన్నా, పెద్దా అవసరాలను సకల సామగ్రిని సృష్టించిన ఆ దయాసాగరుడు, మానవ జీవితానికి దారి చూపవలసిన గొప్ప అవసరాన్ని తీర్చకుండా ఉంటాడా? కాబట్టి మానవుని నుండే ఉత్తములయినవారిని అనగా ప్రవక్తలను మానవ మార్గదర్శకులుగా ప్రభవింపజేసి వారి ద్వారా ప్రజానీకానికి తన ఆజ్ఞలను వెల్లడి చేశాడు. ఇక నిజమయిన ప్రవక్త ఎవరో తెలుసుకోవడమే మనపై ఉన్న బాధ్యత. ఈ దైవ ప్రవక్తలను తెలుసుకోవడానికి కొన్ని ముఖ్యమయిన గుర్తులున్నాయి. అవి ఏమిటంటేః

(1) దైవ ప్రవక్తలు అయినవారు ఏ కుటుంబంలో జన్మించిన వారయినా వారు చూపేటటువంటి సన్మార్గం ఏ ఒక్క తెగకు గాని, జాతికి గాని, దేశానికిగాని, పరిమితమయి ఉండదు. వారి సందేశం విశ్వజనీనమయి ఉంటుంది.

(2) వారు ప్రజలకు దైవం పట్ల మాత్రమే భక్తి విధేయతలు కలిగి ఉండమని చెబుతారుకాని, దైవాన్ని వదలి తమకు విధేయులుగా ఉండమని అసలే చెప్పరు.

(3) ప్రజలకు చూపే మార్గదర్శకత్వం పట్ల స్వయంగా వారే సంపూర్ణ విధేయత కలిగి ఉండి దైవం చూపిన నియమాలను తమ జీవితంలో ఆచరించి చూపెడతారు.

(4) మానవుడు ఈ లోకంలో ఆచరించే ప్రతి పాపపుణ్యకార్యాలు తన మరణానంతరం దైవం విచారించి తగు ఫలాన్ని ఇస్తాడు అనే సత్యాన్ని వెల్లడిస్తారు. ఆ విశ్వాసం ఆధారంగానే ప్రజలను సన్మార్గం వైపుకు మళ్ళించే ప్రయత్నం చేస్తారు

(5) వారు దైవమార్గం చూపే ఏ కృషిఅయితే చేస్తారో ఆ కృషికి ప్రతిఫలాన్ని ప్రజలనుండి కాంక్షించరు. ఇవి ప్రవక్తల గొప్ప ఆనవాలు ఇలాంటి ప్రవక్తల ఉపదేశాలనే విశ్వసించి, వారి ఆజ్ఞలనే శిరసావహించి మనం వారి మార్గాన్నే అనుసరించాలి.

అల్లాహ్, ఆది పురుషుడయిన ఆదమ్ (అలైహిస్సలామ్)కు ప్రవక్త పదవిని ఒసగి, లోకం యదార్థాన్ని, తన ఇష్టాయిష్టాలను, తుది దినాన సంభవించనున్న పర్యవసానాలను తెలిపాడు. ఆ సందేశాన్నే హజ్రత్ ఆదమ్ (అ.స.) తన సంతానానికి తెలిపారు. అటు తర్వాత వారి సంతానమయిన మానవులు వారి బోధనలను మరువగా, దేవుడు మరొక ప్రవక్తను ప్రభవింప జేశాడు. ఈ ప్రవక్తలు ప్రతి దేశంలోను, ప్రతి కాలంలోను ఉద్భవిస్తూవచ్చారు. మానవుడు మరచిన ఆ సన్మార్గాన్ని ప్రజలకు చూపెడుతూ వచ్చారు. ఈ ప్రవక్తలే బైబిల్ గ్రంథంలో "మోషే" అని పిలువబడే హజ్రత్ మూసా (అస.),

"ఏసూ" అని పిలువబడే హజ్రత్ ఈసా (అ.స.), "అబ్రహామ్" అని పిలువబడే హజ్రత్ ఇబ్రాహీమ్ (అ.స.) వగైరాలు. పవిత్ర ఖుర్‌ఆన్ గ్రంథంలో, అరేబియా దేశాన, ఆ చుట్టుపట్ల ప్రభవించిన కొద్ది మంది ప్రవక్తల పేర్లు మాత్రమే చూపబడ్డాయి. కాని ప్రతి దేశాన ప్రవక్తలు వచ్చి మార్గభ్రష్టత్వానికి లోనయిన మానవాళికి సన్మార్గం చూపెట్టారు. ప్రవక్తల మధ్య దేశం, కాలం, భాషల తారతమ్యం ఉన్నప్పటికీ, అందరూ దైవ ప్రవక్తలే గనుక వారి బోధనల్లో ఎలాంటి వ్యత్యాసం ఉండదు.

ఈ ప్రవక్తల్లో కట్టకడపటి ప్రవక్తే హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం). మానవుడు అన్ని దేశాలకు ప్రయాణం చేసి దైవ సందేశాన్ని ప్రజలకు తెలిపే సౌకర్యం ఏర్పడ్డ పరిస్థితుల్లో సర్వ లోకానికి ఒకే ఒక ప్రవక్త చాలు. ఈ చివరి ప్రవక్త వచ్చి లోకం అంతమయ్యే వరకు మానవునికి పనికి వచ్చే జీవన మార్గాన్ని, దైవ సందేశాన్ని ఉపదేశించారు. ఈ ఉపదేశాలే "దివ్య ఖుర్‌ఆన్" మరియు "హదీసులు." కాబట్టి ఇక మరో ప్రవక్త రావలసిన అవసరం అసలే లేదు. హజ్రత్ ముహమ్మద్ (సఅసం) ద్వారా "ఇస్లామ్" ప్రబోధం సంపూర్ణం కాబడి సర్వ లోకానికి ఒకే ఒక షరీఅత్ (ధర్మశాస్త్రం) ప్రసాదించడం జరిగింది. కాబట్టి లోకంలో ధార్మిక జీవనం గడపడానికి, దైవ ప్రసన్నత బడయటానికి, పరలోక మోక్షం పొందడానికి "ఇస్లామ్"ను విశ్వసించడమే ఏకైక మార్గం.

ఇలా ధర్మశాస్త్రాన్ని అనుసరించి, విధేయత జూపేవారికి సత్ఫలితం, తిరస్కరించి దుర్మార్గాన్నవలంబించేవారికి దుష్ఫలితం కలగాలి కదా? ఈ సత్ఫలితాలు-దుష్ఫలితాలు కలుగచేసే సామగ్రి ఈ ప్రస్తుత లోకంలో లేనందువల్ల దుర్మార్గులు ఇక్కడ సర్వ సుఖాలు అనుభవిస్తున్నారు. అదే విధంగా సత్పురుషులు అష్టకష్టాలు భరించడానికి, అన్యాయంగా నిర్బంధింప

బడటానికి ఆస్కారం కలుగుతోంది. సత్కార్యాల కోసం త్యాగాలు చేసి ధన ప్రాణాలను అర్పించినవారెందరో ఉండగా దుష్ప్రవర్తన వల్ల సుఖభోగాలు అనుభవించేవారు ఎంతో మందిని మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. కాబట్టి న్యాయంగా ఆయా కర్మలకు ఫలితాన్ని పొందేందుకు వేరే జీవితం దానికి అవసరమయ్యే సకల సామగ్రి కలిగి ఉండే ఇంకో వ్యవస్థ తప్పక ఉండవలసి ఉంది. ఇదే పరలోకం. ఇది అవసరం, సహేతుకం, సమంజసం కూడాను. కాబట్టి దైవం ఈ పరలోకాన్ని కూడా ఏర్పరచాడు.

# పరలోకం

ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సఅసం) వలెనే ప్రవక్తలంతా లోగడ పరలోకం పట్ల విశ్వాసం అతి ముఖ్యమని, దాన్ని విశ్వసించకపోతే మనిషి జీవితం భ్రష్టమవుతుందని ప్రకటించారు. ఈ పరలోకం పట్ల విశ్వాసం, అక్కడి దుష్ఫలితం పట్ల భయం, అక్కడి సత్ఫలితం పట్ల ఆశల మూలంగానే కదా మానవుడు దైవాన్ని, దైవ ప్రవక్తలను, దైవ గ్రంథాలను విశ్వసించి, దైవాజ్ఞాపాలనజేసి, చెడు మార్గంలో లభించే ఎన్నెన్నో సుఖ సంతోషాలను విడనాడగలుగుతున్నాడు? పరలోకంలోని స్వర్గ, నరక జీవిత భావనల్లేకుంటే, పాపానికి దుష్ఫలితం, పుణ్యానికి సత్ఫలితం ఏమీ లేకపోతే మనిషి దైవానికి సమ్మతమయిన జీవితం గడపవలసిన అవసరం ఏముంది? అలాంటప్పుడు దైవం ఎడల విశ్వాసం కూడా నిరర్థకమే కదా?

ఇహలోకంలో మనం గడిపే ఈ కొద్దిపాటి జీవితం వాస్తవంగా మనకు ఒక పరీక్షా సమయం. మన ప్రభువు, స్వామి అయిన అల్లాహ్ మనకు కొంత మట్టుకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించాడు. దానిని సద్వినియోగం చేసుకుని మనం మంచివారమౌతామో లేక ఈ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం

చేసుకుని మన కాళ్ళను మనమే సొంత గొడ్డలితో నరుక్కుంటామో పరీక్షించటానికే ఈ భూమ్మీదికి మనలను పంపాడు అల్లాహ్. కాబట్టి తుది దినాన ఈ ప్రపంచాన్నంతటినీ దైవం అంతం జేసి, మనం చూస్తున్న ఈ భూమ్యాకాశాలను రూపుమాపి, కొంత కాలం తరువాత మరో వ్యవస్థను సృష్టిస్తాడు. సృష్టి ప్రారంభం లగాయతు తుది దినం వరకు పుట్టి పెరిగి మరణించిన వారందరినీ సజీవులుగా చేసి అందరి కర్మలను లెక్క చూస్తాడు. ఆయన ప్రసాదించిన జ్ఞానాన్ని స్వాతంత్ర్యాన్ని మానవుడు ఉపయోగించిన విధానాన్ని గూర్చి ప్రశ్నిస్తాడు. ప్రతీవాడు ఈ లోకాన చేసిన కర్మల రికార్డు ఆయన ముందుంటుంది. ఆ రికార్డును బట్టి ఆయా ప్రజలకు సంపూర్ణమయిన న్యాయం లభిస్తుంది. మనకు కనిపించే ఈ ప్రపంచం అంతమయి, ప్రతి మానవుడికి ఆ అనంత స్వర్గం లేక శాశ్వత నరక జీవితం ప్రాప్తమవుతుంది. బుద్ధి, హేతువు, న్యాయాల రీత్యా అలా జరగవలసిందే కాబట్టి అలా జరగడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అలా జరక్కపోవడమే ఆశ్చర్యకరమైన విషయం. ఇలా తప్పక జరిగి తీరుతుంది.

## నేటి పరిస్థితి

మానవకోటిని దుష్ప్రవర్తన నుండి సత్ప్రవర్తన వైపుకు మరలించడం కోసం దైవం, పరలోకం, స్వర్గం, నరకం అనే నమ్మకాలు ఎంత తోడ్పడు తున్నాయో ఆలోచించారా? గొప్ప గొప్ప ప్రభుత్వ చట్టాలు మానవునిలో కలిగించలేనటువంటి సత్ప్రవర్తనను ఈ విశ్వాసాలు కలుగచేస్తాయి. ఈ యదార్థాలను తెలిపిన ప్రవక్త మహనీయులు పరలోకాన్ని దృఢపరచగా, వారి సందేశాలను ఎలాంటి ఆధారాలు లేకుండా తమకు తోచినట్లు అనేక రకా లుగా ఖండించే "సైంటిస్టుల" మాటలను మనం ఏ విధంగా నమ్మగలమో ఆలోచించండి.

నేటి ఈ దైవ సందేశాలను మరచి సాంఘిక జీవితం నుండి దైవాన్ని, మతాన్ని తొలగించి దురభిమానాలకు గురి అయి ప్రజాస్వామ్యం, కమ్యూనిజం, నేషనలిజం సిద్ధాంతాలను అవలంబిస్తున్నారు. ఇంపీరియలిజం (Imperialism), డిక్టేటర్‌షిప్ (Dictatorship) లలోని కీడును నేడు ఈ లోకం అనుభవించింది. మతప్రసక్తిలేని ప్రజాస్వామ్యం (Secular Democracy) లేక కమ్యూనిజం (Communism) లోని అనుభవాలూ నేడు ప్రపంచం ముందు ఉన్నాయి.

## కావలసిందేమిటి?

కాన, ప్రియ సోదరులారా! పైన ఉదాహరించబడిన సత్యసందేశాన్ని విశ్వసించి, దాన్ని అనుసరించి ఆ విధంగా ఏర్పడిన సొసైటీ ద్వారానే లోకంలో శాంతి నెలకొని మానవులకు పరలోక మోక్షం లభిస్తుందని మేము దృఢంగా నమ్ముతున్నాము. ఇవి ఊహాగానాలు ఏ మాత్రం కావు. వీటిని అవలంబించినవారు లోగడ చరిత్రలో ప్రశాంతమయిన వ్యక్తిగత జీవితాన్ని,శాంతియుతమయిన సాంఘిక వ్యవస్థను, ఆపై ఒక సంక్షేమ రాజ్యాన్ని నెలకొలిపి ఆదర్శంగా చూపి ఉన్నారు. ఇటువంటి సత్పురుషుల జీవితాలను గురించి నేటికీ మనం చరిత్రలో చదువుతూనే ఉన్నాము. మన దేశానికి సంబంధించిన ఒక గొప్ప వ్యక్తి "గాంధీజీ" మనకు సాంఘిక జీవనం గురించి బోధించేటప్పుడు తరచూ హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (ర.అ.), హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (ర.అ.) పరిపాలనా విధానాన్ని గుర్తుచేసేవారు. ఆ మహా వ్యక్తులు అవలంబించినవి ఈ దైవ సూత్రాలే. హజ్రత్ ముహమ్మద్ (సఅసం) వారు ఈ దైవ సూత్రాల పైన్నే అనాగరికులయిన అరబ్బులను ప్రపంచ నాయకులుగా తీర్చిదిద్దారు. ఒక శాంతియుతమయిన పరిపాలనను స్థాపించి, దైవభీతి

ఆధారంగా ఒక సమాజాన్ని తయారుచేశారు.మన పూర్వీకులు ఈ సూత్రాలను అవలంబించి వృద్ధి వికాసాలు పొందినప్పుడు మనం కూడా ఈ దైవ సూత్రాలనే అవలంబించి ఎందుకు వర్ధిల్లకూడదు? ఈ ధర్మసూత్రాలు మానవులందరికీ సృష్టికర్త అయిన ఆ దైవమే అనుగ్రహించాడు.

దేవుని సృష్టి అయిన గాలి, నీరు, వెలుగు, వేడిమిని మనం ఏ విధంగా అనుభవిస్తున్నామో, అదే విధంగా మన మందరం ఈ సూత్రాలను అవలంబించ టానికి అభ్యంతరం ఏముంది? ఈ దైవ సూత్రాలను మరచి, వదిలివేసిన నేటి మన సమకాలీన ముస్లిమ్ సమాజం ఎంతో ప్రమాద స్థితికి దిగజారింది. ఇవి ముస్లిములకు సంబంధించిన సూత్రాలని, వాటితో మనకు నిమిత్తంలేదని ఇతర సోదరులు పొరబడక, మానవకోటిలో ఏ జాతివారైనా సరే ఈ పవిత్ర సూత్రాలను అవలంబించి లోకానికి మార్గం చూపెట్టగలరని మా విన్నపం.

ఇదే మా విశ్వాసం కూడా. వీటిని వెల్లడి చెయడమే జమాఅతె ఇస్లామీ హింద్ ఉద్దేశ్యం. ఇలా మేము ఎన్నో సంవత్సరాల నుండి మన దేశం యొక్క ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో, మూలమూలల్లో శాంతియుత సమావేశాలు జరిపి మా సందేశాన్ని వెల్లడి చేస్తున్నాం. ఈ సమావేశాల్లో ఎలాంటి ద్వేషానికిగాని, కక్షలకుగాని, అశాంతికిగాని తావులేదు. గాన ఎల్లరు విశాల హృదయంతో మా ఈ సందేశాన్ని పరిశీలిస్తారని నమ్ముతున్నాం. అల్లాహ్ మనకు శాంతిని, సన్మార్గాన్ని చూపుగాక! (ఆమీన్).

—: సమాప్తం :—

# ما هو الحق

تأليف

جلال الدين يوسفي

المكتب التعاوني للدعوة والإرشاد وتوعية الجاليات بالنسيم
الرياض – حي المنار – مقابل العيادات الخارجية لمستشفى اليمامة
هاتف:٢٣٢٨٢٢٦ – ٢٣٥٠١٩٤ فاكس:٢٣٠١٤٦٥
ص.ب: ٥١٥٨٤ الرياض ١١٥٥٣

تلجو
١١٣